Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 324 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 3 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## అమరావతి పున:ప్రారంభ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పున:ప్రారంభ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అమరావతిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ చాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని మోదీ అన్నారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ..“అమరావతి స్వప్నం సాకారమవుతోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్ రూపుదాల్చుతోంది. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను.” అని తన ప్రసంగంలో వెల్లడించారు. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని పేర్కొన్న ప్రధాని మోదీ.. “ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. ఇవి శంకుస్థాపనలు కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. రికార్డు స్పీడ్‌లో అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. చంద్రబాబు.. నా టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు.. ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని నేను గమనించాను. చంద్రబాబును చూసి నేర్చుకొన్నా.” ప్రధాని మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతమన్న ప్రధాని మోదీ.. “రికార్డు స్పీడ్‌లో అమరావతి నిర్మాణాలు కొనసాగేందుకు కేంద్రం సహకరిస్తుంది. ఏపీలోకి ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. రాజధాని అమరావతి ఏపీ ఆశలు, వికసిత్ భారత్ ఆశలు.. స్వర్ణాంధ్రకు బీజం. ఏపీని అధునాతన రాష్ట్రంగా మార్చబోతోంది అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి.” అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం విశేషం.. “అమరావతి స్వప్నం సాకారమవుతున్నట్లు కనిపిస్తోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండూ కలిపి పయనిస్తున్నట్లు గోచరిస్తోంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. దుర్గాభవానీ కొలువైన ఈ భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిపిన ప్రాంతం ఇది. ఇప్పుడు నేను ఈ పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది అని మోదీ ఆసక్తికర ప్రసంగం చేశారు.

## క్వాంటం వ్యాలీగా అమరావతి.. సర్కార్ కీలక ఒప్పందం



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఈరోజు (శుక్రవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో టెక్ దిగ్గజాలు ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో దేశంలోనే తొలి టెక్‌పార్క్‌కు ఏపీ సర్కార్ ఎంవోయూ కుదర్చుకుంది. 2026 జనవరి 1న తొలి క్వాంటమ్ వ్యాలీ టెక్‌పార్క్ ప్రారంభం కానుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. క్వాంటమ్ పరిశోధన, ఆవిష్కరణలతో పాటు ఏపీని ప్రపంచ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సర్కార్ ముందు సాగుతోంది. అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన 'క్వాంటం సిస్టం 2'ని అమరావతిలో నెలకొల్పనుంది.

**భవిష్యత్ పాలనకు పునాది : చంద్రబాబు**

1990లలో దేశంలో ఐటీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ కీలకంగా నిలిచిందని, ఇప్పుడు దేశంలో క్వాంటమ్ విప్లవానికి కూడా నాయకత్వం వహిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఎంవోయూ అనంతరం సీఎం మాట్లాడుతూ... ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో జరిగిన ఒప్పందం 'ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారతదేశానికి కూడా చారిత్రాత్మకం' అని చెప్పుకొచ్చారు. 'క్వాంటమ్ కంప్యూటింగ్' భవిష్యత్ పాలనకు, ఆవిష్కరణలకు పునాది అవుతుందన్నారు. సాంకేతికరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, అయితే వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని అన్నారు. భవిష్యత్ అవసరాలన్నీ క్వాంటం కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని అందుకే అమరావతిని క్వాంటం వ్యాలీ చేయాలనుకున్నట్టు వెల్లడించారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబీఎం, టీసీఎస్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, క్వాంటమ్ వ్యాలీ తక్కువ సమయంలోనే నిర్మించవచ్చని తెలిపారు. ఇప్పటికే ఎల్ అండ్ టీకి స్థలాన్ని కేటాయించామని, మౌలిక వసతులను అత్యంత వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఇందుకోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక కమిటీ నిర్మాణం పురోగతిని పరిశీలిస్తే, మరొక కమిటీ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారిస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి త్వరలోనే ఈ ప్రాజెక్టును సవివరంగా తెలియజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

**కీలక ఘట్టమన్న టెక్ దిగ్గజాలు**

భారతదేశంలో ఐబీఎం క్వాంటం సిస్టం 2 స్థాపన, దేశ క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు కానుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – టీసీఎస్‌తో కలిసి పని చేయడం వల్ల క్వాంటం అల్గోరిథం అభివృద్ధి వేగవంతం అవుతుందని ఐబీఎం క్వాంటం వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. క్వాంటం, క్లాసికల్ సిస్టమ్‌లను కలిపిన హైబ్రిడ్ కంప్యూటింగ్ ద్వారా జీవశాస్త్రం, మెటీరియల్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని.. ఇది ఒక కీలక ఘట్టమని టీసీఎస్ సీటీవో డాక్టర్ హారిక్ విన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో టీసీఎస్ తొలిసారి రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు బీజం వేసిందని టీసీఎస్ ప్రతినిధులు వి.రాజన్న, సి.వి.శ్రీధర్ గుర్తు చేశారు. క్వాంటం వ్యాలీ ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. సీఓఐఎన్ నెట్‌వర్క్ ద్వారా 17 రాష్ట్రాల్లో 43 కేంద్రాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది రెండో క్వాంటం విప్లవమని, ఈవీ బ్యాటరీల నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు దీని ఉపయోగాలు విస్తృతంగా ఉంటాయని ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ అన్నారు. తాజా ఒప్పందంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్టయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ పరిశోధనలకు ఏపీని జాతీయ కేంద్రంగా మార్చడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నంగా భావించవచ్చు.

## సమాజ మార్పుకు కిషోర్ బాలికల శక్తికే ఆధారం

### - తల్లిదండ్రులు, గ్రామస్తులు ఐక్యంగా ముందుకు రావాలి : చింతపల్లి ఐసిడిఎస్ అధికారిణి వెంకటరమణ

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** వేసవి సెలవుల్లో కిషోర్ బాలికల అభివృద్ధి, రక్షణ, సాధికారత కోసం తల్లిదండ్రులతోపాటు గ్రామస్థాయిలో సమిష్టి చొరవ అవసరమని చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.వెంకటరమణ అన్నారు. మండలంలోని గొందిపాకల సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన “కిషోర్ వికాసం” అవగాహన కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు తాంబేలీ మోహన్ రావుతో కలిసి ఆమె కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “12 నుంచి 19 ఏళ్ల వయసు బాలికలు వేసవి సెలవుల్లో తల్లిదండ్రుల సమక్షంలో ఉండేలా చూసుకోవాలి. బంధువుల వద్దకు వెళ్లే బాలికలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. బాలల వివాహాల నివారణలో గ్రామస్థుల భాగస్వామ్యం అత్యంత కీలకం” అని పేర్కొన్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యంపై సుదీర్ఘ చర్చలు జరగగా, పాల్గొన్న తల్లిదండ్రులకు బహుళ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించారు. కిషోర్ బాలికల భవిష్యత్తు కోసం సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.






ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్టు అధికారిణి ఎం.రామలక్ష్మి, సచివాలయ మహిళా సంరక్షకురాలు వనము రత్నాకుమారి, సూపర్వైజర్ విజయ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## నమో దెబ్బకు.. పాకిస్తాన్ తోక ముడవటం ఖాయం : మంత్రి నారా లోకేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రధాని నరేంద్ర మోదీ కొట్టే దెబ్బకు.. పాకిస్థాన్ తోకముడవటం ఖాయమని మంత్రి నారా లోకేష్ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో చనిపోయిన కుటుంబాలకు నివాళులర్పించారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉందన్నారు. పాకిస్తాన్ గీత దాటి, అమాయకులని చంపి చాలా పెద్ద తప్పు చేసిందన్నారు. ఒక్క పాకిస్తాన్ కాదు.. వంద పాకిస్తాన్‌లు వచ్చినా కూడా భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేవని చెప్పారు. వంద పాకిస్తాన్‌లకు సమాధానం చెప్ప గలిగే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉందని, ఆ మిస్సైల్ నరేంద్ర మోదీ అని కొనియాడారు. సింహం ముందర ఆటలు ఆడకూ డదు.. ఆడితే మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్ లోనే పాకిస్తాన్ మిస్సింగ్ కావడం ఖాయమన్నారు. పాకిస్తాన్ ఆర్మీలో పని చేసే వారు కొంతమంది రాజీనామాలు చేశారని, మరికొంతమంది సెలవులో వెళ్లిపోయారని చెప్పారు. అది నరేంద్ర మోదీ పవర్ అంటూ కొనియాడారు. ప్రపంచం మొత్తం ప్రధాని మోదీకి మద్దతు ఇస్తోందన్నారు. కేంద్రం కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందని.. ఇది నిర్ణయం కాదని, ఇది ఒక సంచలనమని మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ అన్నా... అమరావతి అన్నా ఎంతో ప్రేమ అని అన్నారు. అందుకే ప్రధాని ఢిల్లీలో ఎంతో బిజీగా ఉన్నా కూడా కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు.




అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని 94 సీట్లతో ప్రజలు గెలిపించారని, అందుకే ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ కోరిన అన్ని కోరికలనూ తీరుస్తున్నారని చెప్పారు. ఇటీవలే విశాఖ పట్నంలో రైల్వే జోన్, ఎన్‌టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌కు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అలాగే విశాఖ ఉక్క ఫ్యాక్టరీని కూడా కాపాడారని తెలిపారు. ఇప్పుడు అమరావతికి వచ్చి నిధులే కాకుండా.. పనులు కూడా ప్రారం భించబోతున్నట్లు చెప్పారు. వైసీపీ పాలనలో వ్యక్తిగత కక్షతో అమరావతిని చంపేయాలని చూశారని మంత్రి నారా లోకేష్ అన్నారు. వైసీపీ పాలనలో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. జై అమరావతి అన్నందుకు గతంలో బయట తిరగలేని పరిస్థితి ఉండేదని చెప్పారు. ప్రధాని మోదీ శంకు స్థాపన చేసిన అమరావతిని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు ఆపలేదని నారా లోకేష్ పేర్కొన్నారు.

## ఈ రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. 'ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీనే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.

# కార్మికుల హక్కులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది


## - టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం



**కూకట్‌పల్లి, (రాజధాని వార్తలు):** దేశ నిర్మాణంలో కీలక భూమికలైన కార్మికులు, వారి శ్రమను, శక్తిని ప్రతి ఒక్కరం గుర్తించి, గౌరవించాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తెలిపారు. ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజపుత్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, అనంతరం పారిశుద్ధ కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. కార్మికులను ఆత్మీయంగా పలకరించి వారిని శాలువాతో ఘనంగా సన్మానించి, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అని పలు నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావం ఏ ఒక్క దేశం, సంఘటనకో పరిమితం కాదు.. శ్రమ దోపిడీని నిరసిస్తూ యావత్ ప్రపంచ కార్మికుల్లో స్ఫూర్తిని రగిలిస్తూ వేసిన ముందడుగే 'మేడే' అని అన్నారు. జిహెచ్ఎంసి కార్మికుల శ్రమ చాలా గొప్పదని, ఉదయం లేచి రోడ్లు ఊడవడంలాంటి అనేక పనుల్లో శ్రామికుల శ్రమను గుర్తించాలన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. శ్రమకి తగిన గౌరవం లభించాలి. వృద్ధి లక్ష్యాల్లో కార్మికుల పాత్ర ఎనలేనిది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందని వారి సమస్యలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్మికులు దేశ నిర్మాణంలో మేలిమి కఠిన శ్రమతో తమ వంతు పాత్రను నిబద్ధతతో పోషిస్తున్నారు. అయితే, ఈ రోజుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తగిన వేతనాలు, భద్రత, న్యాయమైన ఉద్యోగ ప్రమాణాలు ఇవ్వడం మా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు, వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుంది. కార్మికుల హక్కులు కాపాడేందుకు ప్రతి స్థాయిలో పోరాడతాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు నాగరాజు, యూత్ నాయకులు జహంగీర్, సీనియర్ మహిళా నాయకురాళ్లు స్వరూప గౌడ్, బండి సుధ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ ముదిరాజ్, పవన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో ఎ.ఐ.టి.యు.సి ఆధ్వర్యంలో ఘనంగా 139వ "మేడే" కార్యక్రమాలు

## - పలుచోట్ల రెపరెపలాడిన ఎర్రజెండాలు



**సత్తెనపల్లి, (రాజధాని వార్తలు):** సత్తెనపల్లి పట్టణంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన 139వ "మేడే" కార్యక్రమాన్ని ఎ.ఐ.టి.యు.సి. నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి –అమరావతి బస్ స్టాప్ వద్ద ఉన్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎ.ఐ.టి.యు.సి. ఆధ్వర్యంలో పతాకాన్ని విశ్రాంత లెక్చరర్ ఆర్ శేషయ్య, ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వద్ద. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు శివారెడ్డి, పిడబ్ల్యుడి వర్క్ షాప్ & కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు ఎన్.జె.సి విశ్రాంతి ఉద్యోగి ఎస్.కె సుభాని యూనియన్ జండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు నరిసేటి వేణుగోపాల్, ఎస్‌టియు కార్యనిర్వహణ అధ్యక్షులు ఎస్ఎం సుభాని, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు, ఏఐటియు సి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సత్తెనపల్లి నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు డి.ఆర్.మస్తాన్, ఎస్‌టియు జిల్లా నాయకులు ఎస్ ఎం రహిమాన్, కే సురేష్, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు చిలక అగస్టిన్, కే వీరాంజనేయులు, ప్రేమ్ కుమార్, ఏడుకొండలు. యువజన సంఘం జిల్లా నాయకులు కంబాల ఆనంద్, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమణారెడ్డి, జి భాస్కర్, కిరణ్, యలమంద, ఎన్.బి.కె సాహెబ్, డీ.ఎస్.బి.హుస్సేన్, జోహార్ లా, కరీ ముల్లా, కెనాల్స్ యూనియన్ నాయకులు ఎం మరియదాసు, యు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందం, మేరియల్, కే వెంకటేశ్వర్లు, ప్రకాష్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు మురళి, బిక్షం, కొండలు, ఆటో యూనియన్ నాయకులు ఆర్ బాబు, మాబు, రమేష్, మరిదాస్, నాయకులు పెద్దబ్బాయి, శ్రీనివాసరావు, నాంచారమ్మ, జెర్సీ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

# కరప మండలంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహణ









**కరప, (రాజధాని వార్తలు):** కార్మికుల హక్కుల కోసం పోరాటాలకు నిదర్శనమైన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని కరప మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుండి సీఐటీయూ ఆధ్వర్యంలో గణేష్ భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివోఏలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీతో బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోర్టుల రద్దు, కార్మికుల ఐక్యత, హక్కుల సాధన కోసం నినాదాలు వెల్లువెత్తాయి. తాహశీల్దార్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు నక్కా సత్తిబాబు కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం శివాలయం వీధిలో గల భవన నిర్మాణ కార్మికుల భవనానికి ర్యాలీగా చేరుకొని, అక్కడ ఏర్పాటు చేసిన జెండాను జిల్లా ప్రజాసంఘాల నాయకురాలు సిహెచ్ రమణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాడితేనే తమ హక్కులను సాధించగలరని, రాజకీయ పార్టీలకు కనిపించని కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కరప మండల సెక్టార్ లీడర్ పి. వీరవేణి, ఎం. వరలక్ష్మి, ఆర్. వెంకటలక్ష్మి, నక్కా సత్తిబాబు, కసిలంక పండు, సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు బుద్దాల రాంప్రసాద్, పేపకాయల సుబ్రమణ్యం, దాసరి స్వామి, సత్య, విజయ కుమారి, శివదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# కందాళ వారి వివాహంలో పాల్గొన్న కృష్ణ కిషోర్ రెడ్డి



**ప్రకాశం జిల్లా, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణం లోని శ్రీనివాస కళ్యాణ మండపం (ఎస్ ఎస్ ప్లాజా)లో కొమరోలు మండలం, రెడ్డిచర్ల గ్రామానికి చెందిన కందాళ లలితమ్మ కుమారుడు చి.భార్గవ్ రామ్ మరియు సునిత లకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అరట్లకట్ట ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విరాళాలు



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం అరట్లకట్ట గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఉదారంగా విరాళాలు అందించారు. పాఠశాలలో విద్యనభ్యసించిన ప్రత్తిపాటి ఆదిరాజు డిజిటల్ క్లాస్ రూమ్, కంప్యూటర్ రూమ్ ఆధునీకరణ నిమిత్తం రూ.30,000 విలువైన చెక్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ గుడాల లోవరాజు, కో-ఆప్టెడ్ మెంబర్ గంటా వీరన్న చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. విశ్వేశ్వరరావులకు అందజేశారు. గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి రాయుడు ఈశ్వరరావు రూ. 10,000 విరాళాన్ని అందజేశారు. ఈ నిధులను పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకొచ్చిన దాతలకు పాఠశాల యాజమాన్య కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రయాణికుల దాహార్తికి చలివేంద్రం ప్రారంభం




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైల్వే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సామర్లకోట రైల్వే స్టేషన్లో చలివేంద్రాన్ని రైల్వే మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. వేసవి తాపం అధికంగా ఉంటున్న నేపథ్యంలో రైలు ప్రయాణికులకు చల్లని త్రాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు స్టేషన్ మేనేజర్ రమేష్ చెప్పారు. వేసవి రెండు నెలలపాటు ఈ చలివేంద్రాన్ని స్టేషన్లో కొనసాగించడం ఉన్నట్టు ఆయన చెప్పారు. దూరప్రాంతాలకు ప్రయాణించే రైల్వే ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని ఉపయోగించు కోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ దేవి గిరి, చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ మహేష్, చీఫ్ టికెట్ ఇన్స్పెక్టర్ చైతన్య, చీకు పార్సెల్ సూపర్వైజర్ మొహిద్దిన్, చీఫ్ బుకింగ్ సూపర్వైజర్ శ్రీనివాస్, జూనియర్ ఇంజనీర్ నాగార్జున, టిటిఐ అజీజ్, సీనియర్ సిసిటిసి రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పహల్గామ్ మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాశ్మీర్ పహల్గాం టెర్రరిస్టుల దాడిలో మృతులకు సంతాపం తెలుపుతూ సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దైవజనులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సామర్లకోట పట్టణంలోని బ్రౌన్ పేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద గల బెరాకా బాప్టిస్ట్ చర్చి వద్ద అధ్యక్షులు బిషప్ టి బ్లెస్సింగ్ ప్రారంభించారు. అక్కడి నుండి మండల పరిధిలోని పాస్టర్లు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన బ్రౌన్ పేట సెంటర్ వరకు కొనసాగించి అక్కడ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు భారతీయులపై చేసిన దాడులను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, పాకిస్తాన్ టెర్రరిస్టుల కదలికలపై ప్రభుత్వం కట్టుదట్టమైన నిఘాను ఏర్పాటు చేసి దేశ సరిహద్దుల్లో రక్షణ చర్యలు పటిష్టం చేయాలని కోరారు. ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బిషప్ టి బ్లెస్సింగ్, జి జయబాబు, మున్సిపల్ క్రిస్టియన్ కోఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాన్, నాయకులు జానీ మోజస్, కొండేపూడి రవిబాబులు ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు కార్యదర్శి రెవ కె.జయబాబు కోశాధికారి రెవ వై కరుణ కుమార్, రెవ. ఎమ్ ఎ.జేమ్స్, రెవ ఎ చంటి, రెవ. వి.జాన్, చందు స్టీఫెన్, ఎన్.రాజు, ఎండివి ప్రసాద్, అబ్రాహము, ఎ.పీటర్, జి జస్టియన్ బాబు, వి.సామ్యూల్ రాజు, భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ రక్షణకు అండగా భరోసా పెన్షన్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కుటుంబంలో భర్త మృతి చెందటంతో కుటుంబ రక్షణకు అండగా నిలుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా బుజ్జి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కుటుంబ యజమాని మృతి చెందినప్పటికీ అదే కుటుంబానికి చెందిన భార్యకు తక్షణమే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో బాధిత కుటుంబాలకు రక్షణ లభిస్తుందనీ పింఛన్ దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో సరిపల్లి చిన్న మహాలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో అతని భార్య సరిపల్లి వెంకటలక్ష్మికి అధికారులు, కూటమి నాయకులు గురువారం పింఛన్ అందించారు. ఇలా అనేక కుటుంబాలు ఈ విధానంలో పింఛను పొందుతూ మే నెల నుండి రక్షణ పొందటం విశేషమని ఈ సందర్భంగా కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆసక్తి పెంచుతున్న బకాసుర రెస్టారెంట్




టాలీవుడ్ ప్రముఖ కమెడియన్ ప్రవీణ్ త్వరలోనే హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. బకాసుర రెస్టారెంట్ పేరుతో ఓ హంగర్ కామెడీ మూవీ చేస్తున్నాడు ప్రవీణ్. ఈ సినిమా ఫస్ట్ లుక్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తుండగా, షైనింగ్ ఫణి కీలక పాత్రలో నటిస్తున్నాడు. కొన్నాళ్ల ముందట ప్రవీణ్ తర్వలోనే బకాసుర అనే పేరుతో రెస్టారెంట్‌ను స్టార్ట్ చేయనున్నాడని వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఆల్రెడీ యాక్టర్‌గా బిజీగా ఉన్న ప్రవీణ్‌కు రెస్టారెంట్‌ను స్టార్ట్ చేసి, దాని బాధ్యతలు తీసుకునేంత టైముందా అని అందరూ అనుకుంటున్న టైమ్‌లో ఆ విషయంపై క్లారిటీ వచ్చేసింది. అయితే ప్రవీణ్ రెస్టారెంట్ స్టార్ట్ చేయడం లేదు. బకాసుర రెస్టారెంట్ అనే పేరుతో సినిమాను చేస్తున్నాడు. అందులో ప్రవీణ్ హీరోగా నటిస్తున్నాడనేది అసలు మ్యాటర్. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఆ పోస్టర్‌లో ప్రవీణ్ వంట చేస్తూ పెద్ద గెరిటతో కనిపించగా, పక్కన విచిత్ర ఆకారాల్లో వైవా హర్ష, షైనింగ్ ఫణి కనిపించి పోస్టర్‌ను మరింత ఇంట్రెస్టింగ్‌గా మార్చారు. అదే పోస్టర్‌లో పాడుబడిన పాత బంగళా, మోడుబోయిన చెట్టు చూస్తుంటే సినిమాలో హర్రర్ ఎలిమెంట్స్ కూడా ఉన్నట్టు అర్థమవుతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేయగా, ఆ లుక్ అందరినీ ఆకట్టుకుంటుంది. బకాసుర రెస్టారెంట్ సినిమాతో ప్రవీణ్‌లోని కొత్త యాంగిల్‌ను అందరూ చూస్తారని అందరూ చెప్పుకుంటున్నారు. హంగర్ కామెడీ అనే కొత్త కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ చెప్తోంది. బకాసుర రెస్టారెంట్ అనే సినిమాతో ఎస్‌జె శివ దర్శకుడిగా పరిచయం కానుండగా, ఈ సినిమాను ఎస్‌జె మూవీస్ బ్యానర్‌లో లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మిస్తున్నారు.

# #AA22 షూటింగ్ మొదలయ్యేదప్పుడే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఆఖరిగా వచ్చిన సినిమా పుష్ప2. ఈ సినిమాతో బన్నీ బాక్సాఫీస్ వద్ద ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాడో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఏకంగా రూ. 1800 కోట్లు కలెక్ట్ చేసి రికార్డులు సృష్టించింది. పుష్ప ఫ్రాంచైజ్ సినిమాలతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న ఐకాన్ స్టార్ ఆ క్రేజ్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యాడు. అందులో భాగంగానే బన్నీ తన తర్వాతి సినిమాను అట్లీతో చేసేందుకు రెడీ అయ్యాడు. వాస్తవానికైతే పుష్ప తర్వాత అల్లు అర్జున్, త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేయాలి. కానీ దాన్ని పక్కన పెట్టి మరీ అట్లీతో ప్రాజెక్టును చేయడానికి కారణం తన క్రేజ్‌ను పెంచుకోవాలనుకోవడమే. అట్లీతో బన్నీ చేయబోయే సినిమాకు సంబంధించిన వర్క్ ఆల్రెడీ మొదలైపోయింది. బన్నీ కెరీర్లో 22వ సినిమాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ను మొన్న బన్నీ బర్త్ డే సందర్భంగా ఇవ్వగా, ఇప్పుడు ఈ మూవీ షూటింగ్ కు సంబంధించిన ఓ అప్డేట్ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. #AA22 రెగ్యులర్ షూటింగ్ జులై నుంచి మొదలయ్యే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. జులైలో కచ్చితంగా ఒక షెడ్యూల్‌ను మొదలు పెట్టే ఆలోచనలో డైరెక్టర్ అట్లీ ఉన్నాడని తెలుస్తోంది. అంతేకాదు, ఫస్ట్ షూటింగ్ ముంబైలో జరగనున్నట్టు సమాచారం. ఇప్పటివరకు ఈ షూటింగ్‌కు సంబంధించి ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ లేకపోయినప్పటికీ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం ఈ న్యూస్ నిజమేనని తెలుస్తోంది. ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతుండగా, ఆ వర్క్స్‌లో బన్నీ కూడా ఇన్వాల్వ్ అవుతున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే బన్నీకి లుక్ టెస్ట్ కూడా జరిగింది. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా కోసం అట్లీ ఏకంగా హాలీవుడ్ టెక్నీషియన్లను కూడా రంగంలోకి దించుతున్నాడు. ఈ మూవీపై ఆల్రెడీ మంచి బజ్ క్రియేట్ అయింది.

# శ్రీనిధి మొత్తానికి కొట్టేసిందిగా..!



హీరోయిన్‌గా ఛాన్స్ రావడం ఒక ఎత్తైతే కెరీర్‌ని సక్సెస్ పాత్‌లో నడిపించడం అనేది చాలా ఇంపార్టెంట్. ఈ క్రమంలో కొందరు భామలు ఎంత ఊపు మీద వచ్చారో అదే ఊపులో బయటకు వెళ్తారు. ఐతే కెరీర్ ని కన్ సిస్టెంట్ సక్సెస్‌లను మెయిన్ టైన్ చేయాలంటే చాలా ఫోకస్‌గా ఉండాలి. ఒకటి రెండు సినిమాలు చేసి ఆ తర్వాత ఇష్టం వచ్చినట్టుగా చేస్తే జనాలు కూడా పట్టించుకోవడం మానేస్తారు. ఫ్లాప్ పడిన తర్వాత ఎప్పుడెప్పుడు సక్సెస్ వస్తుందా అనే హోప్‌తో పనిచేస్తుంటారు. పాన్ ఇండియా హిట్ కొట్టినా సరే ఒక ఫ్లాప్ పడితే మాత్రం రిస్క్‌లో పడినట్టే. తిరిగి హిట్ కొట్టేదాకా కాస్త కంగారు ఉంటుంది. ఐతే అలాంటి ఒక సందర్భం నుంచి హిట్‌తో ట్రాక్‌లోకి వచ్చింది శ్రీనిధి శెట్టి. కె.జి.ఎఫ్ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలో హీరోయిన్‌గా నటించిన ఈ అమ్మడు ఆ సినిమాల్లో క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంది. కె.జి.ఎఫ్ 1, 2 హిట్ తర్వాత వెంటనే ఐదారు ఛాన్స్‌లు పట్టేస్తుందని అనుకున్నారు. కానీ అది కుదరలేదు. బహుశా అమ్మడే కావాలని తనకు నచ్చిన కథ కోసం వెయిట్ చేసి ఉండొచ్చు. ఐతే కె.జి.ఎఫ్ తర్వాత ఏరి కోరి చియాన్ విక్రమ్‌తో కోబ్రా సినిమా చేసింది శ్రీనిధి శెట్టి. ఆ సినిమా ఫలితం అమ్మడికి షాక్ ఇచ్చింది. సూపర్ హిట్ కథలను వదిలి విక్రం సినిమా అయితే వర్క్ అవుట్ అవుతుంది అనుకున్న అమ్మడికి మైండ్ బ్లాక్ అయ్యింది.

అందుకే మళ్లీ డైలమాలో పడింది. ఐతే తెలుగు నుంచి ఇదివరకు వచ్చిన ఛాన్స్‌లు కాదన్న ఈ బ్యూటీ సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా సినిమాకు ఓకే చెప్పింది. ఆ సినిమా టైంలోనే నాని హిట్ 3 కి సెలెక్ట్ అయ్యింది. విచిత్రం ఏంటంటే తెలుసు కదా ఇంకా రిలీజ్ కాలేదు కానీ హిట్ 3 రిలీజై సక్సెస్ టాక్ సొంతం చేసుకుంది. నాని ఈమధ్య ఏ సినిమా చేసినా కూడా అదిరిపోతుంది. శైలేష్ కొలను డైరెక్షన్‌లో హిట్ 3 అంటూ మరో విధ్వంసం సృష్టించాడు నాని. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన శ్రీనిధి శెట్టికి లక్ కలిసి వచ్చింది. మొత్తానికి కోబ్రాతో షాక్ తిన్న శ్రీనిధి హిట్ 3 తో హిట్ ట్రాక్ ఎక్కింది. నెక్స్ట్ సిద్ధుతో తెలుసు కదా సినిమా లైన్‌లో ఉంది. తప్పకుండా ఈ కాంబో సంథింగ్ స్పెషల్‌గా ఉంటుందని చెప్పొచ్చు.

# రజనీ, కమల్‌లా చిరు ఎందుకు చేయడం లేదు!



సీనియర్ హీరోలు చాలా వరకు తమదైన మార్కు సినిమాలతో బాక్సీఫీస్‌ని దుమ్ముదులిపేస్తున్నారు. రికార్డు స్థాయి వసూళ్లతో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ అభిమానుల్ని షాక్‌కు గురి చేస్తూ వచ్చిన సూపర్ స్టార్ రజనీకాంత్ జైలర్ మూవీతతో బాక్సాఫీస్‌ని షేక్ చేసిన విషయం తెలిసిందే. హిట్టు కొడితే చాలు అని చేసిన జైలర్ రజనీకి తిరుగులేని విజయాన్ని అందించి కొత్తదారి చూపించింది. సన్ పిక్చర్స్ నిర్మాణంలో నెల్సన్ తెరకెక్కించారు. ఎలాంటి అంచనాలు లేకుండా తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలైన ఈ మూవీ రజనీ కెరీర్‌లోనే రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి ఒక్కసారిగా ఆశ్చర్యపరిచింది. రజనీ మేనిరిజమ్స్, రజనీ మార్కు మెరుపులతో రూపొందిన ఈ సినిమా రికార్డు స్థాయిలో బాక్సాఫీస్ వద్ద రూ. 650 కోట్లు రాబట్టి సంచలనం సృష్టించింది. అదే ఊపుతో రజనీ చేసిన వేట్టయాన్ ఆ స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా వసూళ్ల పరంగా కూడా జైలర్‌ని అధిగమించలేకపోయింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి లోకేష్ కనగరాజ్ కూలీ, నెల్సన్ జైలర్ 2 చిత్రాలపై పడింది. ఈ రెండు సినిమాలపై భారీ క్రేజ్ ఏర్పడింది. రెండింటిలోనూ రజనీ తన ఏజ్‌కు తగ్గ క్యారెక్టర్‌లో పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఏజ్‌కి తగ్గ కథలని, పాత్రలని ఎంచుకుంటూ రజనీ తన మార్కు స్టైల్‌తో బ్లాక్ బస్టర్లని దక్కించుకుంటున్నాడు. ఇదే ఫార్ములాని కమల్ హాసన్ కూడా ఫాలో అవుతున్నాడు. కమల్ హాసన్ విశ్వరూపం 2 తరువాత ఒక్క హిట్‌ని అందుకోలేకపోయారు. రెగ్యులర్ హీరో పాత్రల్లో నటిస్తూ చేసిన సినిమాలేవీ ఆడకపోవడంతో కొత్తగా ట్రై చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పుడే తన ఏజ్‌కు తగ్గ పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నారు. అలా నిర్ణయించుకుని చేసిన సినిమా విక్రమ్. ఏడుపదుల వయసులో తన వయసుకు తగ్గ పాత్రలో కమల్ చేసిన ఈ మూవీ రికార్డు స్థాయి విజయాన్ని అందించి కమల్‌కు సరికొత్త ఉత్సాహాన్ని అందించింది. విక్రమ్ అందించిన ఉత్సాహంతో కమల్ ఇప్పుడు శింబుతో కలిసి థగ్ లైఫ్ చేస్తున్నాడు. చిరు కూడా ఇదే ఫార్ములాని ఫాలో అయిపోయి సరికొత్త యాక్షన్ డ్రామాలకు తెరలేపాలని ఫ్యాన్స్‌తో పాటు సినీ లవర్స్ చాలా కాలంగా కోరుకుంటున్నారు. కానీ చిరు మాత్రం ఇప్పటికీ తన ఏజ్‌కు తగ్గ పాత్రలు చేయకుండా నేలవిడిచి సాము చేస్తున్నారు. ఇప్పటికైనా కమల్, రజనీలని ఫాలో అయితే కెరీర్ మరింత ఊపందుకుంటుందని, మరిన్ని కొత్త కథలు తెరపైకొస్తాయని ఇండస్ట్రీ వర్గాలు, సినీ లవర్స్ ఫీలవుతున్నారు. మరి చిరు అటు వైపుగా అడుగులు వేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే. ప్రస్తుతం చిరు విశ్వంభరలో నటిస్తున్నారు.

# జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ఇంటర్, పదవ తరగతిలో అత్యున్నత స్థాయిలో మార్కులు సాధించిన 9 మంది విద్యార్థినిలకు ఉత్తమ ప్రతిభా పురస్కారముల ప్రదానం





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అధ్యక్షులు బల్లా నాగభూషణము ఆధ్వర్యములో తమ సంస్థ కార్యాలయం, యర్రా వారి వీధిలో పట్టణంలో గల ప్రభుత్వ జి.వి.ఎమ్.సి.. హైస్కూల్, జూనియర్ కాలేజీ లలో చదివిన ఇంటర్ మరియు పదవతరగతి విద్యార్థినిలు అత్యున్నత స్థాయిలో మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థినిలకు జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల వారి జయంతిని పురస్కరిం చుకొని ముఖ్య అతిథి పట్టణ ఉమెన్ ప్రొటెక్షన్ మహిళా పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై పి.రాములమ్మ చేతుల మీదుగా వారికి ప్రతిభా ప్రశంసాపత్రంలు మరియు సిద్దార్థ మెరిట్ మెడల్స్ లతో ఉత్తమ ప్రతిభా పురస్కారములను అందజేసారు. ఈ సందర్భముగా మహిళా ఎస్సై ముఖ్య అతిథి పి.రాములమ్మ మాట్లాడుతూ పట్టణములో గల ప్రభుత్వ స్కూల్, కాలేజీలలో చదువుకున్న పేద విద్యార్థినిలు తమ ప్రతిభతో ఇంటర్, పదవ తరగతి చదివి అత్యున్నత స్థాయిలో మార్కులు సాధించి అనకా పల్లి పట్టణంనకు, ప్రభుత్వ స్కూల్, కాలేజీలకు మంచి పేరును తీసుకు రావటం ఎంతో గొప్ప విషయం అని చదువులో ఇటువంటి మెరిట్ సాధించిన 9 మంది బాలికలను ఉత్తమ ప్రతిభా పురస్కారములతో సత్కరించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ఎంతో సంతోషముగా ఉందని అన్నారు. నిర్వాహక సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణము మాట్లాడుతూ మా అసోసియేషన్ ఆధ్వర్యములో గత 12 సంవత్సరములుగా ఈ ఉత్తమ ప్రతిభా పురస్కార ప్రదానంలను పట్టణములో గల కొంతమంది విద్యార్థులకు అందజేస్తూ వారిని ప్రోత్సహించడం జరుగుతుందని అలాగే విద్యార్థులు మంచి నడవడిక, క్రమ శిక్షణలతో మెలిగి ఉన్నత విద్యను అభ్యసించి వారి కుటుంబాలకు, సమాజానికి, దేశానికి ఉపయోగపడాలని అన్నారు. అవార్డు గ్రహీతలకు నిర్వాహకులు అవార్డుతో బాటు, స్వీట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం, ముఖ్య అతిథి మహిళా ఎస్సై పి.రాములమ్మ, సంస్థ ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, నందేల అప్పారావు, ఊడా నాగేశ్వరరావు, గౌరవ సభ్యులు ఉజ్జి సత్యనారాయణ, పాల్గొన్నారు.


# వయోజనులు గతానికి వారధులు, భవిష్యత్తుకు మార్గదర్శకులు

## - మనం వారి మార్గదర్శకత్వాన్ని విలువైనదిగా పరిగణించాలి : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము











**అనకాపల్లి (కశింకోట), (రాజధాని వార్తలు):** తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శుక్రవారం (మే 2, 2025) రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం జరిగిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమానికి భారత రాష్ట్రపతి హాజరయ్యారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ పోర్టల్ ప్రారంభం, సీనియర్ సిటిజన్స్ హెూమ్‌ల వర్చువల్ ప్రారంభోత్సవం, సహాయాలు మరియు సహాయక పరికరాలు పంపిణీ చేసారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కొరకు ప్రతిజ్ఞ చేసారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన సీనియర్ సిటిజన్స్ హెూమ్‌ల వర్చువల్‌గా ప్రారంభోత్సవంలో భాగంగా అనకాపల్లి జిల్లా కసింకోట మండలం జి.భీమవరం గ్రామంలో పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ ఫాస్టిక్స్ వారిచే నిర్వహించనున్న సీనియర్ సిటిజన్ హెూమ్‌ను గౌరవ భారత రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని అన్నారు. నేటి పోటీతత్వం మరియు వేగవంతమైన జీవితంలో, సీనియర్ సిటిజన్ల మద్దతు, ప్రేరణ మరియు మార్గదర్శకత్వం మన యువతరానికి చాలా ముఖ్యమైనవని రాష్ట్రపతి అన్నారు. సీనియర్ సిటిజన్లకు ఉన్న అనుభవాలు మరియు జ్ఞానం యువతరానికి సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడానికి సహాయపడుతుందన్నారు. వృద్ధులు గతానికి ఒక వారధి లాంటివారని, భవిష్యత్తుకు కూడా మార్గదర్శకులని రాష్ట్రపతి అన్నారు. మన వృద్ధులు తమ వృద్ధాప్యాన్ని గౌరవంగా, చురుగ్గా జీవించేలా చూసుకోవడం ఒక దేశంగా మన సమిష్టి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా సీనియర్ పౌరులకు సాధికారత కల్పిస్తోందని, తద్వారా వారు జీవితంలోని అన్ని అంశాలలో చురుకుగా పాల్గొనవచ్చనన్నారు. వృద్ధుల ఆనందం మరియు శ్రేయస్సు కోసం అందరు పౌరులు తమను తాము అంకితం చేసుకోవాలని, వారి మార్గదర్శకత్వాన్ని విలువైనదిగా పరిగణించాలని మరియు వారి విలువైన సహవాసాన్ని ఆస్వాదించాలని ఆమె కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహిళలు, బాలలు, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఈ సంధర్భంగా మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ పోర్టల్ మరియు దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్స్ హెూమ్‌ల వర్చువల్ ప్రారంభోత్సవం జరిగిందని తెలిపారు. అందులో బాగంగా అనకాపల్లి జిల్లా కసింకోట మండలం జి.భీమవరం గ్రామంలో పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ ఫాస్టిక్స్ వారిచే నిర్వహించనున్న సీనియర్ సిటిజన్ హెూమ్‌ను గౌరవ భారత రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పధకాలు అమలు చేస్తున్నాయని, అందరూ ఈ పధకాలను వినియోగించుకోవాలని తెలిపారు. పది సంవత్సరాల తరువాత ఈ సంవత్సరం రాష్ట్రానికి కొత్తగా 15 సీనియర్ సిటిజన్ గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ పధకాలు వినియోగించుకొనుటకు గాను అవసరమైన సీనియర్ సిటిజన్ కార్డులను గత నెలరోజులలో లక్ష కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్డులు అవసరమైన వారు వారి సంబంధిత గ్రామ/వార్డు సచివాలయంలో గాని, లేదా వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలోగాని, ఆన్లైన్ పోర్టలులో గాని ధరఖాస్తు చేసుకొని పొందవచ్చునని ఆమె తెలిపారు. సంవత్సరానికి అయిదు లక్షల రూపాయలు వైద్య ఇన్సూరెన్స్ సదుపాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో వయోవృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని, వారి యోగ క్షేమాలు, బాగోగులు చూసుకోవలసిన బాధ్యత వారి పిల్లలు, కుటుంబ సభ్యులపై ఉందన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంచాలకులు ఎ.రవిప్రకాష్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య, పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ ఫాస్టిక్స్ నిర్వాహకురాలు డి.రజని, సెక్రటరీ ఎమ్. సత్యవాణి, మహిళా,శిశు సంక్షేమశాఖ ప్రోజెక్టు డైరెక్టరు కె.అనంతలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

# బియ్యం ఎగుమతులపై మళ్ళీ 20% సుంకం విధించిన భారత సర్కారు - మే 1 నుండి అమలు

## - ద్రవ్యోల్బణ ఆందోళనల మధ్య, ఆహార నిల్వలను సురక్షిత పరచడం, బియ్యం వ్యాపారాన్ని చలంగా నిర్ణయం - ఆందోళనలో బియ్యం వ్యాపారులు



**న్యూఢిల్లీ:** బియ్యం ఎగుమతులపై 20 శాతం ఎగుమతి పన్నును భారత ప్రభుత్వం మరోసారి విధించింది. దేశంలో ఆహార ధాన్యాలు నిల్వల సంరక్షణ, బియ్యం ఎగుమతుల నియంత్రణ ఆహార భద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పొరబాయిల్డు బియ్యం, జె.వి గుర్తింపు పొందిన బియ్యం రకాలతో సహా, సిమీ మిల్లింగ్, పూర్తి మిల్లింగ్, పాలీషు లేదా గ్లేజ్ చేయబడిన బియ్యంలకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. గతంలో విధించిన బియ్యం ఎగుమతి ఆంక్షలు సడలించిన కొద్ది నెలల వ్యవధిలోనే తిరిగి ఆంక్షలకు ప్రభుత్వం ఉపక్రమించింది. సెప్టెంబరు 2022లో బియ్యంపై విధించిన పలు ఆంక్షలను 2023 సెప్టెంబరులో ఎత్తివేసింది. వైట్ రైస్ పై ఉన్న కనీస ఎగుమతి ధరను కూడా తొలగించింది. పంజాబు, హర్యానా రాష్ట్రాల్లో గోదాములు నిండిపోవటంతో, గోదాముల ఖాళీను సాధించటం కోసం ఆంక్షల సడలింపు నిర్ణయం తీసుకున్నట్లు కూడా అప్పట్లో ప్రచారం జరిగింది. ప్రపంచ బియ్యం సరఫరా అస్థిరత సమస్యను పరిష్కరించటమే కాక, దేశీయ ఆహారధాన్యాల లభ్యతను పెంచటానికి ప్రస్తుత చర్యలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు.

**తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో జరిగిన జాతీయ స్థాయి భారత్ స్కౌంట్స్ అండ్ గైడ్స్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌంట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ కె.రత్నకుమారి, బేసిక్ గైడ్ కెప్టెన్ పి.ఈశ్వరి దేవి పాల్గొన్నారు.**




# ఎర్రబొమ్మల, కిటుముల గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికైన తాజా నాయకత్వం

## - టీడీపీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండలం లోని ఎర్రబొమ్మల మరియు కిటుముల గ్రామ కమిటీ ఎన్నికలు శాంతియుతంగా, ఏకగ్రీవంగా ముగిశాయి. ఎర్రబొమ్మల పంచాయతీలో మామిడి రాజబాబు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, సగ్గె కుసిల ఉపాధ్యక్షుడిగా కిటుముల గ్రామ కమిటీకి గిన్నెల వెంకట్రావు అధ్యక్షుడిగా, కోరాబు రామారావు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. ఈ ఎన్నికలు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ రావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, పీసా కమిటీ మండల ఉపాధ్యక్షుడు దూరి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు సత్తిబాబు, అబ్బాయి నాయుడు, లక్ష్మణ్, అలాగే తెలుగు యువత నాయకుడు గణపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన నాయకత్వాన్ని కార్యకర్తలు అభినందించారు. గ్రామ అభివృద్ధికి పాలకుల సహకారంతో పనిచేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan